క్లుప్తంగా

తెరచాటుకు కోటదుర్గమ్మ

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ సోమవారం నుంచి తెరచాటుకు వెళ్లారు. దశరా నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 15 నుంచి 24 వరకు ఉన్న నేపథ్యంలో ఉత్సవాలకు ముందు అమ్మవారిని ఆలయంలో తెరచాటున ఉంచడం ఆనవాయితీ. తిరిగి ఈ నెల 15న అమ్మవారికి అడ్డుగా ఉన్న తెర తొలగించి ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ తెలిపారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తం

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడువలస పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖాధికారులు సూచించారు. ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని ఫారెస్ట్ గార్డ్ కిరణ్ తెలిపారు. ప్రజలు రాత్రి సమయంలో బయటకు వెళ్లొద్దని కోరారు. రామినాయుడువలస, పెదమేరంగి, గవరమ్మపేట, బాసంగి, సీమనాయుడువలస, కసుభద్రమ్మవలస తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

గుమ్మలక్ష్మీపురం: వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన జర్నలిస్టులు సోమవారం ఎల్విన్‌పేట సెంటర్లో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.శ్రీనివాసరావు, కె.రాము, సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ.. ఐజేయూ, ఏపీడబ్ల్యూజే పిలుపు మేరకు 'సేవ్ జర్నలిజం' కార్యక్రమంలో భాగంగా మహాత్మునికి వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ప్రమాద బీమా అమలు చేయాలని, కరోనాతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరు చేసేలా జీఓను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

పోక్సో చట్టంపై అవగాహన

కొమరాడ: మండలంలోని కేజీబీవీలో విద్యార్థులకు సోమవారం పోక్సో చట్టంపై దిశ ఎస్సై లావణ్య అవగాహన కల్పించారు. విద్యార్థుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగికంగా వేధించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి వాటిని విద్యార్థులు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో సమగ్ర శిక్షా, కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కాంతారావు కోరారు. ఈ మేరకు సహోద్యోగులతో కలిసి సోమవారం గుమ్మలక్ష్మీపురంలోని గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి ఫుల్ టైంగా మార్పుచేసి వేతనాలు పెంచాలని కోరారు. అలాగే ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు వర్తింపజేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపుచేయాలని, ప్రతీ నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విన్నవించారు.

నిరుపేదకు ఆర్థిక సాయం

గుమ్మలక్ష్మీపురం: గత కొన్నిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని గడికాలనీకి చెందిన జి.లక్ష్మీకి స్థానిక పైడి కుల సంఘం సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. సభ్యులు చందాలు వేసుకుని రూ.4500 సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం సంఘ అధ్యక్షుడు ఎస్.పెంటయ్య ఆధ్వర్యంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

కుంగిన వంశధార వంతెన



వంతెనపై ఏర్పడిన గొయ్యి

భామిని: మండలంలోని అనంతగిరి వద్ద వంశధార వరదకాలువపై నిర్మించిన వంతెన సోమవారం కుంగిపోయింది. రోడ్డు కుంగిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీన్ని నిర్మించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పాటు ఒడిశా నుంచి నిత్యం ఇసుక లారీలు రాకపోకలు సాగించడంతో రోడ్డు కుంగిపోయిందని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



కురుపాం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాత్ముని విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



కురుపాం: పి.లేవిడి జంక్షన్‌లో ఉన్న గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ట్రైబల్ రైట్స్‌ఫోరం అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, సర్పంచ్‌లు



గుమ్మలక్ష్మీపురం: ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ బి.గౌరిశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, తదితరులు



భామిని: తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



గరుగుబిల్లి: తోటపల్లిలోని జట్టు ఆశ్రమంలో గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తేజో సంస్థ వ్యవస్థాపకుడు పీఎస్ ప్రకాశరావు

బాపుజీ బాటలో నడుద్దాం..

జాతిపిత మహాత్మాగాంధీ జయంతి, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరు సత్యం, అహింసలనే ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్‌వారిని ఎదిరించిన గొప్ప పోరాటయోధుడుగా గుర్తింపు పొందగా, మరొకరు జై జవాన్–జై కిసాన్ నినాదంతో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన మాజీ ప్రధానమంత్రి. ఈ సందర్భంగా వారి విగ్రహాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో వారి త్యాగాలను స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని, బాపుజీ ఆశయాల సాధనకు కృషిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



గరుగుబిల్లి: గొట్టివలసలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి



కొమరాడ: విక్రంపురంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది



పాలకొండ: పట్టణంలోని ప్రధాన రహదారిలో చెత్త ఊడ్చుతున్న కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ ఆర్.హనుమంతురావు, కౌన్సిలర్లు



సీతంపేట: ఐటీడీఏలో బాపుజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏపీఓ రోసిరెడ్డి



సీతంపేట: బాలికల ఆశ్రమ పాఠశాలలో మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేస్తున్న సిబ్బంది



వీరఘట్టం: బొడ్లపాడులో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ ఆనందరావు



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది

ఖైదీల్లో పరివర్తన రావాలి



సబ్ జైల్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కృష్ణారావు

పాలకొండ: ఖైదీల్లో పరివర్తన రావాలని జిల్లా సబ్ జైళ్ల అధికారి బి.కృష్ణారావు తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక సబ్ జైలులో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాపుజీ జయంతిని ఖైదీల సంక్షేమ దినోత్సవంగా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. గాంధీజీ జైలు జీవితంలో ఖైదీల కష్టాలను గుర్తించి వారి సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను చేపట్టారని వివరించారు. ఖైదీలందరూ సత్ప్రవర్తనతో నడచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, సిబ్బంది ఎం.వెంకటేశ్వరరావు, పి.చంద్రరావు, విజయ్‌కుమార్, పి.మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం



వాటపాగు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజారావు

పాలకొండ రూరల్: గ్రామస్తులందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించుకుందామని వాటపాగు సర్పంచ్ వావిలపల్లి రాజారావు అన్నారు. గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న రోజుల్లో పంచాయతీలో చేపట్టనున్న ఉపాధిహామీ పనులపై చర్చించారు. అలాగే లుంబూరులో సర్పంచ్ టి.ఉపేంద్రకుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. రూ.80 లక్షలతో ఉపాధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. చేపట్టాల్సిన పనులపై గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. గ్రామసభల్లో ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తా..



గౌరీశంకరరావును సన్మానిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

కురుపాం: మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తానని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు అన్నారు. రెండోసారి మండల కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను మొండెంఖల్ గ్రామంలో ఎంపీటీసీ గుడారి విద్యారాణి, వైస్ ఎంపీపీ బిడ్డికి అన్నాజీరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి, తదితరులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌరీశంకరరావు మాట్లాడుతూ..తనపై నమ్మకంతో రెండోసారి బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీ వాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజుకు రుణపడి ఉంటానన్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలతో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అడ్డాకుల మన్మథరావు, హిమరిక నాగేశ్వరరావు, ఆరిక గోపాలరావు, నాయకులు ఇంటికుప్పల రామకృష్ణ, రేవు సత్తిబాబు, పాపారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం డీపీవీ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు అండర్–14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు పి.లక్షున్నాయుడు సోమవారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్‌లో బి.చైత్రికకృష్ణ, వి.సాయిరితీష్, లాంగ్ జంప్‌లో ఆర్.దిలీప్‌కుమార్, చెస్‌లో బి.తనీష్, కె.జస్వంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వారిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కురుపాం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి తిమ్మక దీపక్ ఎంపికైనట్లు హెచ్ఎం ఆరిక గోవిందరావు, వ్యాయామోపాధ్యాయుడు చంద్రమోహన్, వసతిగృహ సంక్షేమాధికారి మల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 6 నుంచి 8 వరకు గుంటూరు జిల్లా పల్నాడులో జరిగే పోటీల్లో పాల్గొనున్నట్లు చెప్పారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పాలకొండ రూరల్: శ్రీకాకుళం జిల్లాకేంద్ర ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పార్వతికి పింఛను అందిస్తున్న వలంటీరు దేవి

పాలకొండ రూరల్, భామిని: వైఎస్సార్ పింఛన్ కానుకల పంపిణీలో వలంటీర్లు అంకితభావం చూపుతున్నారు. లబ్ధిదారులు ఉన్నచోటకు వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. పాలకొండ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పెరిమాళ్ల పార్వతి, కష్పావీధికి చెందిన బోనెల దాసు శ్రీకాకుళం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వలంటీర్లు అర్తముడి దేవి, టొంపల దివ్య సోమవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. భామిని మండలం బత్తిలికి చెందిన వృద్ధురాలు వడ్డీ కుంతల అనారోగ్యంతో శ్రీకాకుళం జిల్లా రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ సింగం భరత్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశాడు.

హైదరాబాద్ వెళ్లి..



వీరఘట్టం: హైదరాబాద్‌లో ఉన్న వ్యక్తికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు స్రవంతి

వీరఘట్టం: నడుకూరు గ్రామానికి చెందిన సాధు వాసుదేవరావు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. స్వగ్రామానికి రాలేని పరిస్థితిలో ఉండడంతో వలంటీర్ మత్స స్రవంతి సోమవారం హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేసింది. వలంటీర్‌ను సర్పంచ్ కర్రి రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు అభినందించారు.

సంక్షిప్తంగా..

నేడు 'గడపగడపకు మన ప్రభుత్వం'

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలో 15, 16 వార్డుల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం తెలిపారు. సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

స్వామినాథన్ మృతి రైతులకు తీరని లోటు

గుమ్మలక్ష్మీపురం: భారత హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మవిభూషణ్ డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతి పట్ల మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ.. సోమనాథన్ మృతి రైతాంగానికి తీరనిలోటు అని అన్నారు. దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆహార కొరతను అరికట్టవచ్చని భావించి హరిత విప్లవానికి బీజం వేశారన్నారు. తన పరిశోధనలతో గోధుమ, వరిలో కొత్త వండగాలను సృష్టించి వ్యవసాయ రంగానికి ఎనలేని మేలు చేసిన గొప్ప శాస్త్రవేత్త స్వామినాథన్ అని కొనియాడారు.

5న చలో స్టీల్‌ప్లాంట్

గుమ్మలక్ష్మీపురం: విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు నినాదంతో అక్టోబర్ 5న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఆర్చ్(కూర్మనపాలెం) వద్ద నిర్వహించే చలో స్టీల్‌ప్లాంట్ సభను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు మండంగి రమణ, కోలక అవినాష్, కె.గౌరీశ్వరరావు, ఎం.నూకయ్య, సన్యాసిరావు కోరారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురం గిరిజన సంఘం కార్యాలయం వద్ద ఛలో స్టీల్‌ప్లాంట్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలనే కేంద్రం ప్రభుత్వ వైఖరిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ సభకు సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం ముఖ్యఅతిథిగా హాజరవుతారని, ప్రతి ఒక్కరూ ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పాలెం రోడ్డు పనులకు శంకుస్థాపన

కొమరాడ: మండలంలోని పాలెం పంచాయతీ రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మంగళవారం శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, జిల్లా కార్యదర్శి శెట్టి మధుసూదనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

భామిని: గ్రామ సచివాలయాల ఏర్పాటుతో గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. బాలేరు సచివాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ప్రాముఖ్యతను ఉపాధి ఏపీఓ తులసీదాస్ వివరించారు. ఎంపీటీసీ పాలక ఉషారాణి, పార్టీ నాయకులు రొక్కం రామారావు, మేడిబోయిన చలపతిరావు, కార్యదర్శి సత్యవతి, ఉపాధి మేట్లు, వేతనదారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రక్తదానం

సీతంపేట: స్థానిక సామాజిక భవనంలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శంబాం, పెదరామ సర్పంచ్‌లు ఎస్.తిరుపతిరావు, బి.తిరుపతిరావుతో పాటు స్థానిక యువత రక్తదానం చేశారు. సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియాతో బాధపడుతున్న ఉచితంగా రక్తం అందించనున్నట్లు రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్య, సత్యనారాయణ తెలిపారు. రెడ్‌క్రాస్ సేవల కోసం 8919287273కి ఫోన్ చేయాలన్నారు.

జిల్లేడు ద్రావణంతో పంటకు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగమైన జిల్లేడు ద్రావణంతో వరి పంటకు ప్రయోజనం చేకూరుతుందని ఏపీసీఎన్ఎఫ్ ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని కేదారిపురం గ్రామంలో మహిళలు, రైతులకు జిల్లేడు ద్రావణం తయారీ, దాని ఉపయోగాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిలో సహజంగా లభించే జిల్లేడు ఆకులు 10 కేజీలను సేకరించి 200 లీటర్ల నీటిలో 10 లీటర్ల ఆవు మూత్రాన్ని కలిపి 48 గంటల పాటు మగ్గనిచ్చి, ఆ నీటిని నేరుగా పొట్టదశలో ఉన్న వరి పంటలో పిచికారి చేసుకోవడం వలన పంటను ఆశించే తెగుళ్లు దరిచేరవని, ఆశించిన విధంగా దిగుబడి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడంగి తులసమ్మ, ఎంటీలు జి.నిర్మాలా దేవి, గణేష్ శరత్‌చంద్ర, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు, సీఐ మురళీధర్, ఎస్సై రమణ

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు సోమవారం దర్యాప్తు చేశారు. ఈనెల 27న నడిమికెల్లలో వినాయక నిమజ్జనం జరుగుతుండగా గ్రామానికి చెందిన చింతాడ శ్రావణ్‌కుమార్‌ను అదే గ్రామానికి చెందిన కొంగరాపు గంగరాజు, బమ్మిడి పోలిరాజు, ముద్ద కృష్ణ, మరో ముగ్గురు మహిళలు కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు అందినట్లు చెప్పారు. దీనిపై విచారణ చేపట్టి నివేదికను జిల్లా ఎస్పీకి అందజేయనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సీఐ మురళీధర్, వీరఘట్టం ఎస్సై ఎం.వి.రమణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వైద్య సేవలు విస్తృతం చేయాలి: డీఎంహెచ్ఓ



ఆరోగ్య సేవలపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

భామిని: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంకల్ప సప్తాహ కార్యక్రమానికి భామిని మండలం ఎంపికైనందున ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బగాది జగన్నాథరావు సూచించారు. మండలంలోని ఘనసర, బొడ్డుగూడలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయ పార్వతితో కలిసి అవగాహన సమావేశాలు నిర్వహించారు. సంకల్ప సప్తాహ కార్యక్రమం కింద చేపట్టాల్సిన పనులపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయుష్మాన్ భవ ప్రోగ్రాంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అభా ఐడీలు, పీఎంజేవై కార్డుల జారీని ముమ్మరం చేయాలన్నారు. ఇంటింట సర్వేలో గుర్తించిన రోగులకు టోకెన్లు అందివ్వాలని, వారికి వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. వైద్యాధికారి ఎస్.ఫణికుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

వసతిగృహంలో వంటమనిషి మృతి

వీరఘట్టం: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో పనిచేస్తున్న వంట మనిషి కంచరావు పోలారావు(61) హాస్టల్ గదిలో మృతి చెందాడు. ఆదివారం రాత్రి 10 గంటల వరకు విద్యార్థులతో సరదాగా కబుర్లు చెప్పిన పోలారావు సోమవారం తెల్లవారేసరికి నిద్రలోనే కన్నుమూయడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. విషయాన్ని మృతుని బంధువులు, అధికారులకు తెలియజేయడంతో అందరూ వచ్చి పరిస్థితిని పరిశీలించారు. నిద్రలో గుండెపోటుతో చనిపోయిఉంటాడని బంధువులు నిర్ధారించారు. మృతుని భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌డబ్ల్యూఓ పి.గోపీనాథ్, వార్డెన్ ధర్మారావు స్టేట్‌మెంట్ రికార్డు చేసి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు. ప్రభుత్వం నుంచి మృతుని కుటుంబానికి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరలోనే అందజేస్తామని అధికారులు తెలిపారు. హాస్టల్‌ను శుభ్రం చేసేవరకు అక్కడ ఉన్న 12మంది విద్యార్థులను గరుగుబిల్లి మండలం రావివలస ఎస్సీ బాలుర వసతి గృహానికి తరలించనున్నట్లు వార్డెన్ తెలిపారు.